క్లుప్తంగా

లైంగికదాడి కేసులో ఫొటోగ్రాఫర్ అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కొత్తలింగాలకు చెందిన ఫొటోగ్రాఫర్ టి.వంశీకృష్ణను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. కోర్టులో న్యాయమూర్తి ఉత్తర్వులు మేరకు జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ బృందం

రఘునాథపాలెం: ఇల్లెందు మండలం గుండాల గ్రామానికి చెందిన ఓ బాధితుడు ఖమ్మంలోని బ్రిందా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆయన ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో మండలంలోని వేపకుంట్లకు చెందిన జీపీఆర్ ట్రస్ట్ బాధ్యులు చేయూతనిచ్చారు. నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయాన్ని బాధితుడి స్వగ్రామానికి తమ సొంత ఖర్చులతో తరలించినట్లు ట్రస్ట్ చైర్మన్ గుర్రం సత్యనారాయణ తెలిపారు. అంతేకాక మండలంలోని రజబ్‌అలీనగర్, మూలగూడెం తదితర గ్రామాల్లో ట్రస్ట్ సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్లు చెప్పారు.

స్తంభాద్రి ఆలయాన్ని దర్శించుకున్న పీఠాధిపతి



శ్రీ పరమేశ్వరానంద స్వామితో కార్యనిర్వాహణాధికారి, అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: తపోవన పీఠాధిపతి శ్రీ పరమేశ్వరానంద గిరిస్వామి మంగళవారం నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి, అర్చకులు సంప్రదాయ పద్ధతుల్లో స్వామివారికి స్వాగతం పలుకగా.. పీఠాధిపతి భద్రాచలం శ్రీ సతీరామచంద్ర స్వామివారిని దర్శించుకొని అక్కడ నుంచి ఖమ్మం నగరానికి వచ్చి శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని వినియోగించుకోండి

కామేపల్లి: ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలోని ప్రతి ఖాతాదారుడు వ్యక్తిగత బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కామేపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ విజయ భవాని అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలకు రూ.436, రూ.20 చెల్లిస్తే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సాయం లభిస్తుందని చెప్పారు.

నగరంలో సినిమాలు

తిరుమల	స్కంద
వినోద	చిన్నా
సాయిరాం	యూనివర్సిటీ, రతినిర్వేదం
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	చంద్రముఖి 2
సుందర్	మిస్టరీ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	40		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	90		20
బీర	30	తోటకూర	3
దొండ	24		20
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	86		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	26	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		20
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	



లబ్ధిదారులు ఇళ్లల్లోకి రాకపోవడంతో ఇంటి ముందు పెరిగిన పిచ్చి మొక్కలు

'డబుల్'.. ట్రబుల్!

సమస్యలు ఫుల్.. సదుపాయాలు నిల్..

- తాగునీరు, కరెంట్ లేక లబ్ధిదారుల అవస్థలు
- ఇళ్లల్లో ఉండలేక తిరిగి వెళ్తున్న కాలనీవాసులు
- డ్రెయినేజీలో నిలిచిన మురుగుతో భరించలేని కంపు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం అధికారుల తీరుతో అభాసుపాలవుతోంది. అధికారుల ప్రణాళిక లోపం, పర్యవేక్షణ లేకపోవడంతో అనేక సమస్యలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో ఉండేందుకు కష్టంగా మారి తిరిగి సొంత గూటికి చేరుకున్న పరిస్థితి నెలకొంది.

కామేపల్లి: మండలంలోని సాతానిగూడెం గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కింద 50 మంజూరయ్యాయి. కాగా, వాటి నిర్మాణం పూర్తి కావడంతో



డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరు

మూడు నెలల క్రితమే అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అధికారులు వారికి లక్కీ డ్రా పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. దీంతో ఇన్నేళ్లు సొంతిళ్లు లేక ఇబ్బంది పడిన పేదవారు తమ కలను సీఎం కేసీఆర్ తీర్చారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తర్వాత ఆ ఇళ్లల్లోకి గృహప్రవేశం చేసినా.. లబ్ధిదారులకు ఆ ఆనందం లేకుండాపోయింది. కేవలం ఇళ్లు మాత్రమే నిర్మించి ఇచ్చారే తప్ప కనీసం మౌలిక సదుపాయాలను కల్పించకపోవడంతో ఆ ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. 50 మంది లబ్ధిదారులకు కేవలం 20 మంది కూడా ఆ ఇళ్లల్లో ఉండడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇళ్ల నుంచి వెళ్లిపోతున్నారు..



డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారు కానీ సౌకర్యాలు కల్పించడం మరిచారు. కనీసం తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో రోజూ నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. కొంతమంది ఇళ్ల నుంచి తిరిగి వెళ్లిపోయారు. కనీసం తాగునీరు, విద్యుత్ సౌకర్యాలన్నా కల్పించి ఆదుకోవాలి.

– నూరపల్లి సుమాంజలి, కాలనీవాసి

విద్యుత్ సౌకర్యం లేదు..



విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో ఇళ్లు లేక నానా ఇబ్బందులు పడినం. మళ్లీ ఇక్కడ కూడా తాగునీరు, విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నాం. రెండు నెలలుగా ఇబ్బందులోనే కాలం వెళ్లదీస్తున్నాం. కనీస సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలి.

– దొంగల మౌనిక, కాలనీవాసి

ఇబ్బంది పడుతున్నాం..



ఇళ్లు కేటాయించిన అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. తాగునీరు. విద్యుత్, రోడ్లు, వీధి లైట్లు వంటి సౌకర్యాలను వెంటనే కల్పించాలి. ఇళ్లల్లో ఉండేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇళ్లు ఇచ్చి లాభం లేకుండా పోయింది.

– మామిడాల మణి, కాలనీవాసి

సమస్యల నిలయంగా ఇళ్లు..

డబుల్ బెడ్రూంలో ఉన్నవారికి తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాం లేక నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఆ ఇళ్లలోనే ఉంటూ అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. నిత్యం బిందెలతో నీటి కోసం దూరం వెళ్లి తెచ్చుకుంటున్న పరిస్థితి. దూరంలో ఉన్న ఒక విద్యుత్ స్తంభానికి అందరూ వైర్లు తగిలించి కరెంట్‌ను వినియోగించుకోవడంతో లోవోల్టేజీ సమస్యతో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. డ్రెయినేజీలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమల వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నారు. ఇళ్లు కేటాయించిన అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడకపోవడంతో లబ్ధిదారులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నేనున్నంత వరకూ మార్కెట్ ఇక్కడే...

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎంపీ రవిచంద్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: ఎమ్మెల్యేగా తాను మొదటిసారి ఎన్నికైనప్పుడు మార్కెట్‌ను ఇక్కడ నుండి తరలిస్తారనే ఆరోపణలు చేశారని, కానీ తాను ఉన్నంత వరకు మార్కెట్‌ను తరలించడం జరగదని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 46వ డివిజన్‌లో మంగళవారం వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తోందని తెలిపారు. వర్తక, వ్యాపార సంఘాల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో కృషి చేస్తానని చెప్పారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడగా 54వ డివిజన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా మంత్రి పువ్వాడ పాల్గొన్నారు. భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, పసుమర్తి రాంమోహన్, నాయకులు నాయకులు గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం 12వ డివిజన్ రాధాకృష్ణ నగర్‌లో వల్లమూడి గోపాల్‌రావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ మరింత అభివృద్ధి జరగాలంటే ఖమ్మం నుంచి మరోమారు తనను గెలిపించాలని కోరారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, సుడా చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మితో పాటు నాయకులు నాగేశ్వరరావు, తాతా ప్రసాద్, చేకూరి హన్మంతరావు, శ్రావణ, వల్లభనేని రామారావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. ఇక 24వ డివిజన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కూడా మంత్రి పువ్వాడ మాట్లాడారు. పార్టీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్ రెహమాన్, గోలి రామారావు మాట్లాడుతూ కార్పొరేటర్ కమర్తపు మురళి పార్టీని వీడినా తామంతా మంత్రి వెంటే ఉంటామని తెలిపారు. పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు పిల్లి విజయ్‌పాల్, పారా ఉదయ్ కుమార్, అమరగాని వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బూల్, పల్లా రోజ్‌లీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం..

ఖమ్మం వైరారోడ్: నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలను వివరించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రఘునాథపాలెం మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పథకాలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి జరిగిన విసయాన్ని వివరించాలని తెలిపారు. ఈసమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, జెడ్పీటీసీ ప్రియాంకతో పాటు వెంకటరమణ, పిన్ని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి అందరూ కృషి చేయాలి

కామేపల్లి: కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని దేవాదాయశాఖ ఖమ్మం విభాగం పరిశీలకురాలు సమత తెలిపారు. మంగళవారం దేవాలయ పరిధిలోని దుకాణాలకు బహిరంగ వేలం పాట నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కొబ్బరి కాయలు, పూజసామగ్రి దుకాణాన్ని కొత్తగట్టు ఉమ రూ.1.20 లక్షలకు, కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకోనేందుకు కొత్తగట్టు శ్రీకాంత్ రూ.12 వేలకు, లడ్డు, పులిహోర ప్రసాదముల దుకాణాన్ని వడ్డె లక్ష్మణ్ రూ.21 వేలకు, తలనీలాలు ప్రోగు చేసుకోనుటకు సజ్జ శ్రీను రూ.26,500 వేలకు దుకాణాలను వేలంలో కైవసం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య,ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పూజారి పుల్లయ్యశర్మ, గ్రామస్తులు ప్రభాకర్, అప్పారావు పాల్గొన్నారు.

రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

నేలకొండపల్లి: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర సూచించారు. మండలంలోని చెన్నారం గ్రామంలో ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్‌లో ఖాతా ప్రారంభించడంతో పాటు ఆధార్ సీడింగ్ కూడా చేయించాలని, ఆధార్ లింక్ తప్పనిసరిగా చేయించాలని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి డి.అరుణ కుమారి, ఏఈఓ ఉదయ్‌కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఫకీర్ సాహెబ్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న షేక్ సయ్యద్ బాషా, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఫకీర్ సాహెబ్ సేవలు మరువలేనిదని తెలంగాణ నూర్‌బాషా, దూదేకుల, ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్.సయ్యద్ బాషా అన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జనాబ్ షేక్.ఫకీర్‌సాహెబ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం సంఘ కార్యాలయంలో ఫకీర్‌సాహెబ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫకీర్‌సాహెబ్ సేవలను కొనియాడారు. వచ్చేవారంలో జరిగే దూదేకుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సోందు, జిల్లా నాయకుడు డాక్టర్ రహీం, మహిళా అధ్యక్షురాలు సభినాబీ, రహీం పాషా, సిద్దు బాషా, మొగలా, సైదులు, పీజీ సైదులు, నగర అధ్యక్షుడు షేక్ రసూల్, ఆర్.సైదులు, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి కోరారు. మంగళవారం బైపాస్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య అధ్యక్షతన జరిగిన ఖమ్మం నియోజకవర్గ శక్తి కేంద్రాల పోలింగ్ బూత్‌ల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి ఇప్పుడు కొత్త హామీలు ఇచ్చి ప్రజలను మరోమారు మోసం చేయాలని కేసీఆర్ ప్రభుత్వం చూస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు మోసం చేసే పార్టీలేనని పేర్కొన్నారు. కేవలం 40 రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యాన పార్టీ కార్యకర్తలు అహర్నిశలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయననుఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ త్రిలోకేశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉప్పల శారద, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, వాసుదేవరావు, పుల్లారావు, నంబూరి రామలింగేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, నున్నా రవి, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మ పోస్టర్లు ఆవిష్కరణ



బతుకమ్మ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: ఈనెల 22న ముదిగొండ మండలం వల్లభిలో నిర్వహించే బహుజన బతుకమ్మ వేడుకల పోస్టర్లను మంగళవారం జిల్లా కోర్టులో ఆవిష్కరించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో ప్రజలు, న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రవీందర్, బిచ్చాల అన్వేష్, పాపయ్య, స్పర్శ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను ఆకట్టుకునేలా బీఎస్పీ మేనిఫెస్టో..

కూసుమంచి: రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ ఆధ్వర్యాన రూపొందించిన మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉందని జిల్లా నాయకుడు ఉపేందర్ అన్నారు. మంగళవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన రూపొందించిన మ్యానిఫెస్టో ఇతర రాజకీయ పార్టీలకు రూపొందించిన మ్యానిఫెస్టోల కంటే అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. బహుజన భరోసా, కాన్షీ యువ సర్కార్, పూలె విద్యా దీవెన, బహుజన రైతు బీమా, చాకలి ఐలమ్మ మహిళా జ్యోతి లాంటి పథకాలు పేద, బహుజన వర్గాలకు అనువుగా ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు నల్లగట్టు శంకర్, శ్రీకాంత్ స్వేరో, బొడ్డు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఎంపీటీసీ దంపతుల రాజీనామా

నేలకొండపల్లి: మండలంలో బైరవునిపల్లి ఎంపీటీసీ మరికంటి ఉమారాణితోపాటు ఆమె భర్త వార్డు సభ్యుడు రమేశ్ బీఆర్‌ఎస్‌కు మంగళవారం రాజీనామా చేశారు. గ్రామానికి చెందిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, అమె భర్త రేణుబాబు ఏడాది కాలం నుంచి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. అలాగే, మత్స్య సొసైటీ లెక్కలు అడగడంతో తమను ఇబ్బంది పెడుతుండగా రాజీనామా చేశామని తెలిపారు.

'కర్నాటి' జీవితం ఆదర్శం



కృష్ణయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: మాజీ శాసన సభ్యుడు కర్నాటి కృష్ణయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కృష్ణయ్య 25వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్తూపం వద్ద నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాకు సాగర్ జలాలు రావడానికి కర్నాటి కృష్ణయ్య చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, మండల నాయకులు మచ్చా రఘుపతిరావు, కర్నాటి రవీందర్, మచ్చా రేణుక, కర్నాటి నళిని, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కాళబోయిన అయోధ్య, పాల్తీయా శ్రీనివాసరావు, మల్లేబోయిన ఉపేందర్, రాయల మాధవరావు, మాలోత్ అయోధ్య, పాలపాటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దళిత అజెండాను చేర్చాలి

ఖమ్మంరూరల్: అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో దళిత అజెండాను చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వి.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని పల్లెగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పార్టీలు ప్రకటించిన మ్యానిఫెస్టోల్లో దళితులకు భూపంపిణీ, కౌలు రైతుల హక్కులు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు వంటి అంశాలే లేవన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై అనునిత్యం దాడులు జరుగుతున్నాయని, దాడులను నిర్మూలించడంలో అక్కడి పాలకులు విఫలమయ్యారని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె.రామకృష్ణ, గడ్డికొప్పుల ఏసు, సైదమ్మ, బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా కాంగ్రెస్ పాలన



గ్యారంటీ పథకాలను వివరిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధికి చిరునామాగా పరిపాలన అందిస్తామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుదిమళ్లలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోల్లోని ఆరు గ్యారంటీ పథకాలు వృద్ధులు, మహిళలు, రైతులు, నిరుద్యోగులకు మేలు జరిగేలా పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో అంతా అవినీతిమయం అయిందని, ఏ ఒక్క పథకం ప్రజలకు చేరలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు బైరు హరినాథబాబు, యాదగిరి, మురళి, మెండు వెంకటేష్, ఉపేందర్, కందుకూరి వెంకటనారాయణ, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, సైదులు, చర్ల సాంబశివరావు, పి.మంగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు

వివిధ అవతారాల్లో అమ్మవారు



అన్నపూర్ణాదేవి | వారాహీదేవి | కాత్యాయనీదేవి | అన్నపూర్ణాదేవి | ధైర్యలక్ష్మి

శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశాక తీర్థప్రసాదాలు స్వీకరించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో మహారథంపై అమ్మవారిని ఊరేగించారు. అనంతరం అమ్మవారి మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: నాయుడుపేటలోని లెక్చరర్స్ కాలనీలో అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కూసుమంచి: పెరికసింగారంలో అన్నదానం



ఖమ్మంఅర్బన్: 8వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో..



ఖమ్మంగాంధీచౌక్: బురహాన్‌పురంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న గుండాల కృష్ణ



ఖమ్మంగాంధీచౌక్: గుట్టలబజార్‌లో అమ్మవారిని మహారథంపై ఊరేగిస్తున్న భక్తులు